పేదల కోసమే సంక్షేమ పథకాలు

- ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- వివిధ గ్రామాల కుల సంఘాలకు నిధుల ప్రొసీడింగ్ పత్రాలు అందజేత


యానంపల్లికి మంజూరైన ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం రూరల్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల కుల సంఘాలకు మంజూరైన మొత్తం రూ.52లక్షల నిధుల ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎస్‌డీఎఫ్, సీడీఎఫ్ నిధులు రూ.46కోట్లతో కమ్యూనిటీ హాల్స్ నిర్మించుకున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ దాసరి ఇందిర లక్ష్మీనర్సయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

సిరికొండ/ఇందల్వాయి: సిరికొండ మండల కేంద్రానికి చెందిన మోటాడిరెడ్డి సంఘం సభ్యులు, గడ్కోల్ గ్రామానికి చెందిన నాయకపోడు సేవాసంఘం సభ్యులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇందల్వాయి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు సర్పంచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బీఆర్‌ఎస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సిరికొండ సర్పంచ్ రాజారెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, గౌస్, జీకెరెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


యువకులకు కండువా కప్పుతున్న ఆర్టీసీ చైర్మన్

గణపతికి ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

డిచ్‌పల్లి/సిరికొండ/నిజామాబాద్ సిటీ/సుభాష్ నగర్/మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంతోపాటు వివిధ గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద గణపతికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు, భజనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నగరంలోని శివపుత్ర గణేష్ మండలి 22వ వార్షికోత్సవము సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. నగరంలోని వైశ్య రత్న గణేష్ మండలితోపాటు పలు వినాయక మండపాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా కలిసిమెలిసి భగవంతుని నామస్మరణతో జరుపుకోవాలని ఆయన సూచించారు.


నగరంలోని వైశ్య రత్న గణేష్ మండలి వద్ద పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నేత ధన్‌పాల్, భక్తులు




నడిపల్లితండాలో గణేశ్ మండపం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న మండలి సభ్యులు.. గడ్కోల్ గ్రామంలో.. నల్లవెల్లి గ్రామంలో..


కంజర్ గ్రామంలో..


నగరంలోని వివేకానంద కాలనీలో..


ఇందల్వాయి మండలంలో..




మహాలక్ష్మీనగర్‌లో గణేశ్ మండపం వద్ద యజ్ఞం నిర్వహిస్తున్న కాలనీవాసులు.. పాంగ్రా బ్యాంక్ కాలనీలో.. సాయి రెసిడెన్సీ అపార్టుమెంట్‌లో..

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



మోపాల్‌లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు.. సిరికొండలో అంగన్‌వాడీల సమ్మెలో చిన్నారులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు మండలకేంద్రంలో చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది మోపాల్ ప్రధాన రహదారిపైకి వచ్చి ధర్నా చేసి, నిరసన తెలియజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. 14 రోజులుగా నిరసనలు తెలియజేసినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టినసమ్మె కొనసాగుతోంది. సమ్మెకు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులు, తల్లులు, గర్భిణులు మద్దతు తెలిపారు. సిబ్బంది జయంతి, భాగ్యలక్ష్మీ, రజిత, పుష్ప, సునీత, రాధాకృష్ణ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు, 30% ఇంటీరియమ్ రిలీఫ్‌తో పే రివిజన్ కమిటీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్– రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. నాందేవ్‌వాడలోని పెన్షనర్స్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న మూడు విడతల డీఏలను విడుదల చేయాలని, ఎంప్లాయీస్ హెల్త్ స్కీంను పటిష్టపరిచి నగదు రహిత వైద్యాన్ని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు శాస్త్రుల దత్తాద్రిరావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రావు, రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి మదన్‌మోహన్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఘనంగా వృద్ధుల ఆదివారం



డిచ్‌పల్లి: మండలంలోని బర్దిపూర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఫాస్టర్ రెవరెండ్ ఘనపురం దినకర్ ఆధ్వర్యంలో వృద్ధుల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 15 మంది వృద్ధులను సత్కరించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. చర్చి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టడం సరికాదు

సిరికొండ: భద్రాచలం ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కొండా చరణ్‌పై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం సరికాదని పార్టీ నాయకుడు రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపంథా పార్టీ నాయకుడిపై మావోయిస్టు అని కేసులు మోపడం పోలీసుల అక్రమ వ్యవహారానికి నిదర్శనమన్నారు. అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డికి సన్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) మోటాటిరెడ్డి సంఘం కల్యాణ మండపంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు ఈగ రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మధుసూదన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సాయిరెడ్డి, ఈగ సాయిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మురళీకృష్ణరెడ్డి, విక్రంరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఈగ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి


మాట్లాడుతున్న మంత్రి వేముల

భీమ్‌గల్: తెలంగాణలో 60 ఏండ్లలో కాని అభివృద్ధిని తొమ్మిదేళ్లలో చేసి చూపించామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. బాబాపూర్ హైవే నుంచి పురాణీపేట్ వరకు బైపాస్ రోడ్డు, బాబానగర్ కాలనీ నుంచి కుప్కల్ వరకు బీటీ రోడ్డు రెన్యువల్, రూ.50లక్షలతో హనుమాన్ ఆలయ కల్యాణమండపం, హెల్త్ సంబ్‌సెంటర్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం భీమ్‌గల్ పట్టణంలో నిర్వహించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాలమహానాడు నూతన కమిటీ ఎన్నిక



బోధన్: మాల మహానాడు సాలూరా మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా బేగరి కృష్ణ, గౌతం బాలేరావు, ప్రధాన కార్యదర్శిగా షేరే భీమ్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా గౌతంప్రసాద్, గైని ప్రశాంత్, కోశాధికారిగా విఠల్, సలహాదారులుగా రాహుల్, లక్ష్మణ్, గంగాధర్ సోన్‌కాంబ్లే, బాలేరావు హన్మంతు, అరులే సునీల్, నీరడి ప్రకాశ్ ఎన్నికైనట్లు డివిజన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, మచ్కూరి దేవేందర్, అడ్వైజర్ సాలెన్ సంజీవ్ కుమార్, నాయకులు సరిడే సాయిలు, సింగాడే పాండు, గ్రామాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ మండల అధ్యక్షుడిగా అశోక్



రుద్రూర్: కాంగ్రెస్ ఓబీసీ విభాగం మండల అధ్యక్షుడిగా కర్కె అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు రాజరాజ నరేందర్ గౌడ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అశోక్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అశోక్ ప్రస్తుతం రుద్రూర్ సహకార సంఘం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

ఉత్తమ ప్రైవేట్ టీచర్‌గా కమలాకర్



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్‌కు చెందిన బోడగుడ్డు కమలాకర్‌కు ఆల్ తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఆదివారం హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆల్ తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్‌నాయక్ చౌహాన్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ శేషు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తాం



బాల్కొండ: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం రూ.5లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని ఆ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం పోచంపాడ్, నెహ్రూనగర్ కాలనీల్లో ఆదివారం 'గడపగడపకు కాంగ్రెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అవినీతిరహిత పాలన అందించడమే తమ ధ్యేయమన్నారు. మెండోరా మండలం సోన్‌పేట్‌కు చెందిన శివాజీయూత్ సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా, సునీల్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పారు.

గ్రీన్ బడ్జెట్ పేరుతో అవినీతి

ఆర్మూర్‌టౌన్: మొక్కల పేరున 'గ్రీన్ బడ్జెట్' అని రూ.25లక్షల అవినీతికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆదివారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ ఆవిర్భావ సంబురాల్లో మిఠాయికి రూ.33వేలు ఖర్చయినట్లు చూపించారని, బోర్ల రిపేర్‌కు ప్రతి బడ్జెట్‌లో రూ.10లక్షల బిల్లులు చూపిస్తున్నారని విమర్శించారు. జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కలిగొట ప్రశాంత్, పాన్ శీను, పులియుగేందర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ పరిధిలోని ఆచన్‌పల్లిలో ఆదివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డి మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాసిని వినోద్, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి వాసు, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం



నగరంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే.. బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా
- నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ

నిజామాబాద్‌నాగారం: ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. నగరంలోని పలు డివిజన్లలో ఆదివారం వివిధ అభివృద్ధి పనులను ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిలో నిజామాబాద్ నగరం ముందంజలో ఉందన్నారు. హైదరాబాద్ తరహాలో ఎక్కడ చూసినా నగరం నలు దిక్కుల పచ్చదనంతో విరాజిల్లుతుందన్నారు. మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపరచడానికి ప్రతి డివిజన్ రూ.1కోటి చొప్పున నిధులు మంజూరు చేశామన్నారు. మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు బద్దురి మదుల అరుణ్, భూపతి వనితశ్రీనివాస్, సత్యపాల్, రేసు హనుమాండ్లు, పుంద్ర నరేష్‌రెడ్డి, అక్బర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

నగరంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన 200 మంది యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, ఇర్ఫాన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రూప్1 పరీక్ష రద్దు

నిజామాబాద్‌అర్బన్: గ్రూప్–1 పరీక్ష రద్దవడం ప్రభుత్వ వైఫల్యమేనని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ ఆరోపించారు. నగరంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్న టీఎస్పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేయాలన్నారు. ఉద్యోగాల భర్తీలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరితమైన వైఖరితో కొనసాగుతుందన్నారు. అలాగే తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రమావత్ లాల్‌సింగ్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే పేపర్ లీకేజీలు జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వం టీఎస్పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా రాధాష్టమి



నిజామాబాద్ సిటీ: నగరంలో ఆదివారం ఇందూరు ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో రాధాష్టమి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాధా రాణికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే రాధాకృష్ణుల పాటలపై భక్తులు చేసిన నృత్యాలు అలరించాయి. రామానంద రాయ్ గౌరదాస ప్రభుజీ, భక్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



నిజామాబాద్ సిటీ: నగరంలోని జెండా బాలాజీ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ముత్యాల ప్రకాష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీసీలకు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలి



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో బీసీలకు రాజకీయ పార్టీలు మూడు బీసీ సీట్లు కేటాయించాలని బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రమేష్ యాదవ్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అవకాశం ఇవ్వాలన్నారు. బీసీలకు న్యాయం చేకుంటే పోరాటాలు చేస్తామన్నారు. వేదిక సభ్యులు పోశెట్టి, గణేశ్‌గౌడ్, రాజమల్లు యాదవ్, జనార్ధన్, గంగాధర్, రాజేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,000	వెండి (కిలో)	77,000
22 క్యారెట్స్	56,240		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	20	40	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	17	30
బీర్నీసుకాయ	50	70	గోబిగడ్డ	15	30
కాకరకాయ	25	50	గోబిపువ్వు	25	50
వంకాయ	40	60	బీట్‌రూట్	35	60
పాలకూర	50	70	కరివేపాకు	40	60
మెంతికూర	50	70	చామగడ్డ	40	60
కొత్తిమీర	50	70	గోరుచిక్కుడు	35	50
పుదీనా	50	70	చిక్కుడుకాయ	70	90
క్యాప్సికం	25	50			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 జవాన్(తెలుగు)- 10.10,1.20,7.30, మార్క్ ఆంటోని(తెలుగు)-4.30
- స్క్రీన్-2 సప్త సాగరాలు దాటి(తెలుగు)-10.30, 4.30, 10.30; మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -1.30 7.30
- స్క్రీన్-3 వారెవ్వా జతగాళ్లు (తెలుగు)-10.20; 7/జీ బృందావన కాలనీ(తెలుగు)-1.20,7.30; జవాన్(హిందీ)- 4.30; మార్క్ ఆంటోని(తెలుగు)-10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 జవాన్(హిందీ)- 11.30,3.05,6.40, 10.15
- స్క్రీన్-2 7/జీ బృందావనకాలనీ(తెలుగు)-12.30, 10.20; మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి -4.00; మార్క్ ఆంటోని(తెలుగు)-7.10
- స్క్రీన్-3 నచ్చినవాడు(తెలుగు)-11.00; మట్టికథ(తెలుగు)-2.00; ది నన్-2(ఇంగ్లీష్)- 4.10; ఖుషి(తెలుగు)- 6.45; మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి(తెలుగు)- 10.10
- స్క్రీన్-4 మార్క్ ఆంటోని(తెలుగు)-1.25; అష్టదిగ్బంధనం(తెలుగు)-4.35; టీటర్(తెలుగు)-7.30

- దేవి 7/జీ బృందవన్ కాలనీ-11.00,9.00; మార్క్ ఆంటోని(తెలుగు)-2.15,6.15
- నటరాజ్ జవాన్(హిందీ)
- లలితామహల్ మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
- విజయ్ జవాన్(తెలుగు)